వెలుగు జిలుగుల మధ్య.. ఐపీఎల్ ఆరంభ వేడుకలు

చెన్నై: ఐపీఎల్ 17వ సీజన్‌కు అట్టహాసంగా తెరలేచే సమయం ఆసన్నమైంది. శుక్రవారం ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా తారల తళుకు బెళుకుల మధ్య లీగ్ ప్రారంభం కాబోతున్నది. సాయంత్రం 6.30 గంటలకు మొదలయ్యే సాంస్కృతిక కార్యక్రమాలు అభిమానులను అలరించనున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోలు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ డ్యాన్స్‌లతో జోష్ తేనున్నారు. తాము కలిసి నటించిన బడే మియా..చోటే మియా సినిమాను ప్రమోషన్ చేయనున్నారు. వీరికి తోడు ప్రముఖ సింగర్ సోను నిగమ్, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ పాటలతో స్టేడియం హోరెత్తనుంది.

షమీ స్థానంలో సందీప్

అహ్మదాబాద్: సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ స్థానంలో యువ మీడియం పేసర్ సందీప్ వారియర్‌ను గుజరాత్ టైటాన్స్ తమ జట్టులోకి తీసుకుంది. ఇటీవలే కాలి మడమ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న షమీ..ఈ ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. వన్డే వరల్డ్‌కప్ సందర్భంగా గాయపడ్డ షమీ పూర్తిగా కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేరళకు చెందిన సందీప్‌ను కనీస ధర 50 లక్షలకు గుజరాత్ తీసుకుంది.

సూర్య నంబర్‌వన్

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్: టీ20 ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ (861) నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సూర్య తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. గాయం కారణంగా గత మూడు నెలలుగా జాతీయ జట్టుకు దూరమైన సూర్య..ఐపీఎల్‌లో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. ఫిల్ సాల్ట్, రిజ్వాన్, ఆజమ్ వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంక్‌ల్లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ (645) తిరిగి టాప్-10లోకి దూసుకొచ్చాడు.

రైజర్స్ ఈసారైనా..

కొత్త కెప్టెన్, కొత్త కూర్పుతో బరిలోకి

సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) ఐపీఎల్ పోరుకు సర్వశక్తులతో సిద్ధమవుతున్నది. 2013లో అరంగేట్రం నుంచి ఇప్పటి దాకా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న హైదరాబాద్ లీగ్‌లోకి వచ్చి రావడంతోనే తనదైన మార్క్ చూపెట్టింది. అప్పటి వరకు బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగుతున్న లీగ్‌లో బౌలర్ల దమ్ము ఏంటో చేతల్లో చూపించింది. మొదటి సీజన్‌లో ప్లేఆఫ్స్‌లో నిలిచిన హైదరాబాద్ మూడేండ్ల వ్యవధిలో చాంపియన్‌గా నిలిచి వారెవ్వా అనిపించింది. ఆ తర్వాత నాలుగేండ్లు అదే జోరు కనబరిచింది. కానీ 2021 నుంచి సన్‌రైజర్స్ సీన్ పూర్తిగా రివర్స్ అయ్యింది. ప్రతీ ఏడాది కెప్టెన్, కోచ్ మార్చిన రైజర్స్ లీగ్ దశలోనే తమ పోరాటాన్ని ముగిస్తూ వచ్చింది. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా కొత్త కెప్టెన్‌గా కమిన్స్, కోచ్‌గా వెటోరీతో లీగ్‌లో అడుగుపెడుతున్న రైజర్స్ ఈ సారైనా కప్ కలను సాకారం చేసుకునేందుకు పట్టుదలతో ఉంది.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ది ప్రత్యేక ప్రస్థానం. 2013లో లీగ్‌లో అడుగుపెట్టిన సన్‌రైజర్స్ వచ్చి రావడంతోనే తమ మార్క్ చాటుకుంది. బ్యాటర్ల ఆధిపత్యానికి సూపర్ బౌలింగ్ దళంతో గండికొడుతూ స్వల్ప లక్ష్యాలను కాపాడుకున్న జట్టుగా నిలిచింది. డేవిడ్ వార్నర్ సారథ్యంలో 2016లో తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన ఎస్ఆర్‌హెచ్ మళ్లీ ఆ ఫీట్‌ను పునరావృతం చేయలేకపోయింది. గత వైభవానికి కొనసాగింపుగా ఈసారి మరింత దుర్భేద్యమైన బౌలింగ్ దళంతో ప్రత్యర్థులకు వణుకు పుట్టించేలా ప్రణాళికలు రచిస్తున్నది.

కొత్త కొత్తగా..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి కొత్త కొత్తగా కనిపిస్తున్నది. గత మూడేండ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని తిరిగి కొనసాగిస్తూ కొత్త కెప్టెన్ ప్యాట్ కమిన్స్, కొత్త కోచ్‌గా డానియల్ వెటోరీతో సీజన్‌తో ప్రారంభించబోతున్నది. గత మూడు సీజన్లలో హైదరాబాద్ ప్రతీసారి కొత్త నాయకునితో బరిలోకి దిగింది. ఆస్ట్రేలియాకు వన్డే ప్రపంచకప్‌తో పాటు డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్ అందించిన కమిన్స్ తొలిసారి ఐపీఎల్‌లో కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. వేలంలో కనివినీ ఎరుగని రీతిలో కమిన్స్‌ను రూ.20.50 కోట్లతో దక్కించుకున్న రైజర్స్ యాజమాన్యం..మెరుగైన ఫలితం ఆశిస్తున్నది.

బలం: లీగ్‌లో మిగతా జట్లతో పోలిస్తే..హైదరాబాద్‌కు బౌలింగ్ ప్రధానాస్త్రం. గత తొమ్మిదేండ్లుగా ఎంతటి స్వల్ప లక్ష్యాన్ని అయినా హైదరాబాద్ కాపాడుకున్న వైనం. కమిన్స్ చేరికతో రైజర్స్ బౌలింగ్ దళానికి మరింత బలం చేకూరింది. గత సీజన్‌లో భువనేశ్వర్‌కుమార్(16), మయాంక్ మార్కండే మెరుగ్గా రాణించారు. మరోవైపు అనుభవలేమితో సతమతమవుతున్న రైజర్స్ స్పిన్ విభాగానికి హసరంగ చేరిక బలం చేకూర్చనుంది. సుందర్, షాబాజ్ అహ్మద్, సుబ్రమణ్యన్‌తో కలిసి హసరంగ బౌలింగ్‌ను పంచుకోనున్నాడు. ఈసారి విదేశీ ప్లేయర్ల రాక హైదరాబాద్‌ను పటిష్ఠంగా మార్చింది. ముఖ్యంగా కమిన్స్, హెడ్, హసరంగ జట్టులో చేరడం గెలుపు అవకాశాలను మెరుగుపర్చనుంది.

బలహీనత: హైదరాబాద్‌కు భారత స్టార్ బ్యాటర్ల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది. మయాంక్ అగర్వాల్, రాహుల్ త్రిపాఠి, అభిషేక్‌శర్మ, అబ్దుల్ సమద్ ఉన్నా..ఇటీవలి ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే టోర్నీల్లో వీరి ప్రదర్శన అంత బాగా ఏం లేదు. దీనికి తోడు గత సీజన్‌లో భారత బ్యాటర్లు ఏ ఒక్కరూ కూడా 300 పరుగుల మార్క్ అందుకోలేకపోయారు.

అవకాశాలు: కెప్టెన్‌గా కమిన్స్ జట్టులో సమిష్టి తత్వాన్ని నింపే అవకాశముంది. ఇన్ని రోజులుగా ఎవరికి వారుగా అన్నట్లు రాణించిన హైదరాబాద్‌ను ఒక్కతాటి పైకి తీసుకొచ్చేందుకు కమిన్స్ అనుభవం ఉపయోగపడునంది. గత రెండేండ్ల నుంచి జాతీయ జట్టుకు దూరమైన భువనేశ్వర్ తిరిగి రీ ఎంట్రీ ఇచ్చేందుకు ఈ ఐపీఎల్ మంచి అవకాశం. ఇటీవలి దేశవాళీ టోర్నీల్లో అదరగొట్టిన భువీ..టీ20 ప్రపంచకప్‌లో చోటే లక్ష్యంగా రాణించే చాన్స్ ఉంది.

జట్టు అంచనా:
హెడ్, అభిషేక్, త్రిపాఠి, అగర్వాల్, క్లాసెన్, సుందర్, అహ్మద్, కమిన్స్(కెప్టెన్), హసరంగ, భువనేశ్వర్, నటరాజన్, సమద్(ఇంపాక్ట్ సబ్)

ఐపీఎల్-17 షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక	సమయం
మార్చి22	చెన్నై X బెంగళూరు	చెన్నై	రా.8.00
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	ముల్లాన్‌పూర్	మ.3.30
	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా	రా.7.30
మార్చి 24	రాజస్థాన్ X లక్నో	జైపూర్	మ.3.30
	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్	రా.7.30
మార్చి 25	బెంగళూరుX పంజాబ్	బెంగళూరు	రా.7.30
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై	రా.7.30
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్	రా.7.30
మార్చి 28	రాజస్థాన్ X ఢిల్లీ	జైపూర్	రా.7.30
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు	రా.7.30
మార్చి 30	లక్నో X పంజాబ్	లక్నో	రా.7.30
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్	మ.3.30
	ఢిల్లీ X చెన్నై	వైజాగ్	రా.7.30
ఏప్రిల్ 1	ముంబై X రాజస్థాన్	ముంబై	రా.7.30
ఏప్రిల్ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్	రా.7.30
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్	రా.7.30
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 6	రాజస్థాన్ X బెంగళూరు	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై	మ.3.30
	లక్నో X గుజరాత్	లక్నో	రా. 7.30

స్టార్ స్పోర్ట్స్‌లో మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం

'సన్‌రైజర్స్ మేము బ్రో.. పక్కా ఇంకో రేంజ్ బ్రో'

మరికొన్ని గంటల్లో ఐపీఎల్‌కు తెరలేవబోతున్న నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త పాటతో అభిమానుల్లో మస్తు జోష్ తీసుకొచ్చింది. 'సన్‌రైజర్స్ మేము బ్రో..పక్కా ఇంకో రేంజ్ బ్రో' అంటూ సాగే ఈ మాస్ బీట్ ఆరెంజ్ ఆర్మీ అభిమానులను హుషారెత్తిస్తున్నది. ఈ పాటను ఎస్ఆర్‌హెచ్ తమ అధికారిక ట్విటర్(ఎక్స్) ద్వారా బుధవారం విడుదల చేసింది. పక్కా మాస్ సాంగ్‌తో రూపుదిద్దుకున్న ఈ వీడియోలో కెప్టెన్ కమిన్స్, భువనేశ్వర్, మార్క్‌రమ్, హెడ్, సుందర్, అభిషేక్, ఉమ్రాన్ మాలిక్ అలరించారు. పాటకు తగ్గట్లు హైదరాబాద్‌లోని చారిత్రక ప్రదేశాలైన చార్మినార్, మొజంజాహీ మార్కెట్, దుర్గం చెరువును ఇందులో చూపించారు. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పికిల్‌బాల్ చాంప్ సాహిల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సాహిల్ రెండు టైటిళ్లతో మెరిశాడు. బుధవారంతో ముగిసిన టోర్నీలో పురుషుల డబుల్స్ ఫైనల్లో సాహిల్, ధవల్ జోడీ 15-7తో గౌరవ్‌దీప్ ఘోష్, సికాశ్ ద్వయంపై గెలిచింది. అదే జోరు కొనసాగిస్తూ మిక్స్‌డ్ డబుల్స్‌లో సాహిల్, ప్రాచీ జంట 16-4తో చరిత, వెంకట్ ద్వయంపై గెలిచి టైటిల్ దక్కించుకుంది. గేమ్‌పాయింట్ ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో విజేతలకు కోఫౌండర్ సిద్ధార్థ్‌రెడ్డి ట్రోఫీలు అందజేశారు.

శ్రీకాంత్, లక్ష్యసేన్ ముందంజ

బాసెల్: స్విస్ ఓపెన్‌లో భారత షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-17, 21-18తో వాంగ్ జు వీ(చైనీస్ తైపీ)పై అలవోక విజయం సాధించాడు. మరో సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-19, 15-21, 21-11తో లియాంగ్ జున్ హవో(మలేషియా)పై గెలిచాడు. ఇటీవల ముగిసిన ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో సెమీస్ చేరిన లక్ష్యసేన్..మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. మహిళల డబుల్స్‌లో తనీషా క్యాస్ట్రో, అశ్విని పొనప్ప జోడీ 21-18, 18-21, 21-19తో మెలిసా ట్రయాస్, రాచెల్ అలీస్సా ద్వయం(ఇండోనేషియా)పై గెలిచింది. సింగిల్స్‌లో పీవీ సింధు 21-12, 21-13తో పోర్నిచ చోయిపై విజయం సాధించింది. ప్రియ, శృతి మిశ్రా జోడీ రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది.

దేశీయ మార్కెట్లోకి ఎంజీ సైబర్‌స్టార్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును విడుదల చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఎండీ పార్థ్ జిందాల్, ఎంజీ మోటర్ ఇండియా ఎండీ రాజీవ్ చాబా

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ 5 వేల కోట్ల పెట్టుబడి

ముంబై, మార్చి 20: చైనాకు చెందిన అతిపెద్ద వాహన సంస్థ ఎస్ఏఐసీ మోటర్‌తో జేఎస్‌డబ్ల్యూ గ్రూపు జతకట్టింది. ఇరు సంస్థలు కలిసి ఏర్పాటు చేసిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకొక సరికొత్త ఈవీని విడుదల చేయనున్నట్లు ప్రకటించిన సంస్థ..ఇందు కోసం గుజరాత్‌లో రూ.5 వేల కోట్ల పెట్టుబడితో రెండో ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు. జాయింట్ వెంచర్‌లో ఏర్పాటైన సంస్థలోజేఎస్‌డబ్ల్యూకి 35 శాతం వాటా ఉండగా, ఇండియన్ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కు 8 శాతం, ఎంజీ మోటర్‌కు 3 శాతం ఉద్యోగులకు ఉండగా, మిగతా 49 శాతం వాటా ఎస్ఏఐసీ ఉన్నది. 2030 నాటికి దేశవ్యాప్తంగా ప్రతియేటా కోటి వాహనాలు అమ్ముడవుతాయని అంచనావేస్తున్న సంస్థ..వీటిలో పది లక్షల యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నది సంస్థ. రెండో ప్లాంట్ అందుబాటులోకి వస్తే కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం లక్ష యూనిట్ల నుంచి 3 లక్షల యూనిట్లకు పెరగనున్నది. 2023లో ఎంజీ మోటర్ దేశంలో 60 వేల యూనిట్ల వాహనాలను విక్రయించింది.

ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ వొల్వో కార్ ఇండియా..దేశీయ మార్కెట్‌కు మరో ఈవీ మాడల్‌ను పరిచయం చేసింది. ఎక్స్‌సీ 40 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ఎక్స్‌షోరూం ధరను రూ.54.95 లక్షలుగా నిర్ణయించింది. కేవలం 7.3 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 475 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

37% మంది మహిళలు పనిమంతులే

ముంబై, మార్చి 20: దేశీయంగా పనిచేసే మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 69.2 కోట్ల మంది మహిళల్లో 37 శాతం మంది మహిళలు పనిమంతులే అని కేరియర్‌నెట్స్ 'ది స్టేట్ ఆఫ్ వుమెన్స్ ఎంప్లాయిమెంట్ ఇన్ ఇండియా' పేరుతో బుధవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అత్యధిక మంది మహిళా ఉద్యోగులు కలిగిన నగరాల జాబితాలో 34 శాతంతో హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో 33 శాతంతో పుణె, 29 శాతంతో చెన్నై ఉన్నాయి. 2022తో పోలిస్తే ఆ మరుసటి ఏడాదిలో మహిళా ఉద్యోగుల సంఖ్య 2-5 శాతం వరకు పెరిగారని తెలిపింది. ముఖ్యంగా జూనియర్ ప్రొఫెషనల్స్, ఎగ్జిక్యూటివ్ బోర్డ్‌ల్లో పనిచేసేవారు అధికంగా ఉన్నట్లు పేర్కొంది. గతేడాది కొత్తగా ఉద్యోగాలు పొందిన వారిలో 40 శాతం మంది ఫ్రెష్ ట్యాలెంట్ అని పేర్కొంది. మొత్తం ఉద్యోగ కల్పనలో 0-3 ఏండ్ల అనుభవం, 3 నుంచి 7ఏండ్ల అనుభవం ఉన్నవారి వాటా 20-25 శాతం వరకు ఉన్నారని తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో అత్యధిక మంది మహిళకు ఉద్యోగాలు లభించాయి.



రూపాయి.. గింగిరాలు

మరో 16 పైసలు పడిపోయిన విలువ

రెండు రోజుల్లో 30 పైసలుకు పైగా పతనం

ముంబై, మార్చి 20: రూపాయి గింగిరాలు కొడుతున్నది. వరుసగా ఎనిమిదో రోజు దేశీయ కరెన్సీ బక్కచిక్కింది. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో బుధవారం కూడా రూపాయి విలువ 16 పైసలు కోల్పోయింది. దీంతో రెండు నెలల కనిష్ఠ స్థాయి 83.19కి పడిపోయినట్లు అయింది. క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమనడంతోపాటు మిగతా కరెన్సీలు బలహీనపడినప్పటికీ డాలర్‌కు డిమాండ్ ఊపందుకోవడం ఇందుకు కారణమని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 83 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 83.19 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివర్లో 16 పైసలు తగ్గి అంతే స్థాయి వద్ద ముగిసింది. మంగళవారం కూడా రూపాయి విలువ 13 పైసలు కోల్పోయిన విషయం తెలిసిందే.

విదేశీ పెట్టుబడిదారులు కూడా..

దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడంతో కరెన్సీ మార్కెట్లో అలజడి సృష్టించింది. గత రెండు రోజులుగా పతనమైన సూచీలు బుధవారం పెరిగినప్పటికీ ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గు చూపారు. దిగుమతిదారులు ఎగబడి డాలర్లను కొనుగోలు చేయడం వల్లనే రూపాయిపై ఒత్తిడి పెరిగిందని, అలాగే చెల్లింపులకోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి రానుండటం కూడా పతనానికి ఆజ్యంపోసిందని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసర్చ్ అనలిస్ట్ శ్రీరామ్ అయ్యర్ తెలిపారు. అలాగే వడ్డీరేట్లపై ఫెడరల్ రిజర్వు సమావేశం జరగనుండటం కూడా ప్రతికూల ప్రభావం చూపిందన్నారు. అలాగే యూరో, పౌండ్ కరెన్సీలు కూడా తగ్గుముఖం పట్టాయి.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఎస్బీఐ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు దన్నుగా నిలిచాయి. రూపాయి భారీగా పతనమవడం, చిన్న స్థాయి షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో భారీ లాభాలకు అడ్డుకట్టవేశాయి. ఒక దశలో 400 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు 89.64 పాయింట్లు అందుకొని 72,101.69 వద్ద ముగిశాయి. మరో సూచీ నిఫ్టీ 21.65 పాయింట్లు అందుకొని 21,839.10 వద్ద స్థిరపడింది. ప్రత్యక్ష పన్ను వసూళ్లు భారీగా పుంజుకోవడంతో దేశీయ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి రాగలిగాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. అలాగే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు కుమ్మరించడం కూడా సూచీలకు కలిసొచ్చింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశం ఉండటం సూచీలను కొంతమేర నిలువరించాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. మార్కెట్లో మారుతి, నెస్లె, పవర్‌గ్రిడ్, ఎస్బీఐ, ఐటీసీ, రిలయన్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ముగియగా..టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి. రంగాలవారీగా చూస్తే ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, టెలికమ్యూనికేషన్, ఆటో, యుటిలిటీ రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. కానీ, కమోడిటీస్, ఆర్థిక సేవలు, ఐటీ, మెటల్, టెక్ షేర్లు నష్టపోయాయి.

రాంకీకి భారీ ఆర్డర్లు

హైదరాబాద్, మార్చి 20: రాష్ట్రానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాకు రూ.217 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. వీటిలో రూ.39.88 కోట్లు ఆర్డర్, రూ.176.77 కోట్ల విలువైన రెండు ఆర్డర్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నుంచి లభించినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది.

డాటా వినిమయం 3 రెట్లు

న్యూఢిల్లీ, మార్చి 20: 4జీ వినియోగదారులు వినియోగిస్తున్న డాటా కంటే 5జీ యూజర్లు 3.6 రెట్లు అధికంగా డాటాను వినియోగిస్తున్నారని నోకియా తాజాగా వెల్లడించింది. అక్టోబర్ 2022 నుంచి దేశవ్యాప్తంగా 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం నోకియా విడుదల చేసిన 'మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్' నివేదికలో స్పష్టంచేసింది. 2023లో మొత్తం వినియోగించిన డాటాలో 5జీ వాటా 15 శాతంగా ఉన్నది. 2023లో ఒక్కో యూజర్ నెలకు సరాసరిగా 17.4 ఎక్సాబైట్స్ డాటాను వినియోగించారు.



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

వచ్చే సమీక్షలో వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, మార్చి 20: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ భేటీ అయ్యారు. వచ్చే నెల తొలివారంలో తన పరపతి సమీక్షను ప్రకటించనున్న నేపథ్యంలో వీరిద్దరు భేటీ ప్రాధాన్యతను సంతరించుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను తన తొలి పరపతి సమీక్షను ఏప్రిల్ 3-5 వరకు నిర్వహించబోతున్నది. రిటైల్ ధరల సూచీ నాలుగు శాతం తగ్గడానికి ఆహార పదార్థాల ధరలు అడ్డంకిగా మారాయని ఆర్బీఐ విడుదల చేసిన బుల్లెట్‌లో వెల్లడించింది. గతేడాది డిసెంబర్ నుంచి తగ్గుతూ వచ్చిన రిటైల్ ధరల సూచీ ఫిబ్రవరి నెలలో 5.09 శాతంగా నమోదైంది. మరోవైపు, వచ్చే సమీక్షలోనూ ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయిలోనే కదలాడుతుండటం, ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉండటమే ఇందుకు కారణమని తెలిపాయి.

మైక్రోసాఫ్ట్ ఏఐ బాస్‌గా ముస్తఫా సులేమాన్

లండన్, మార్చి 20: మైక్రోసాఫ్ట్ కన్స్యూమర్ కృత్రిమ మేధస్సు వ్యాపార అధిపతిగా ముస్తఫా సులేమాన్ నియమితులయ్యారు. టెక్నాలజీ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన కృత్రిమ మేధస్సుకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ నెలకొన్నది. ఈ విషయాన్ని సులేమాన్ తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈవోగా త్వరలో బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు చెప్పారు. డీప్‌మైండ్ కో-ఫౌండర్ సులేమాన్ ఈ సంస్థను 2014లో గూగుల్‌కు విక్రయించారు.

ఐపీవోకి హెక్సాకామ్

న్యూఢిల్లీ, మార్చి 20: భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థయైన భారతీ హెక్సాకామ్ ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతినిచ్చింది. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లోనే 10 కోట్ల షేర్లను విక్రయించనుండగా, కొత్తగా షేర్లను జారీ చేయడం లేదు. భారతీ హెక్సాకామ్‌లో భారతీ ఎయిర్‌టెల్‌కు 70 శాతం వాటా ఉన్నది.

వాణిజ్య

గెలాక్సీ సిరీస్‌లో నయా ఫోన్లు

హైదరాబాద్, మార్చి 20: దేశంలో అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండైన సామ్‌సంగ్.. గెలాక్సీ సిరీస్‌లో భాగంగా మరికొన్ని స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. మధ్య-ప్రీమియం స్థాయి సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గెలాక్సీ ఏ55 5జీ, గెలాక్సీ ఏ35 మాడళ్లను ప్రవేశపెట్టింది. గోరిల్లా గ్లాస్ విక్టస్+ప్రొటెక్షన్, ఏఐతో పనిచేసే విధంగా కెమెరా ఫీచర్, ట్యాంపర్-రెసిస్టెంట్ సెక్యూరిటీ సొల్యూషన్ ఫీచర్ కలిగిన ఈ ఫోన్లు నాలుగు రకాల్లో లభించనున్నాయి. గెలాక్సీ ఏ55 5జీ మొబైల్ రూ.36,999 నుంచి రూ.42,999 లోపు, గెలాక్సీ ఏ35 5జీ మొబైల్ రూ.27,999 నుంచి రూ.30,999 లోపు లభించనున్నాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, పన్ కార్డ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ కార్డుతో కొనుగోలు చేసిన వారికి రూ.3 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఆరు నెలలపాటు నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ సదుపాయాన్ని కూడా కల్పించింది.

31న బ్యాంకులు ఓపెన్

ముంబై, మార్చి 20: ఈ నెల 31న ఆదివారం రోజున బ్యాంకులు తమ శాఖలను తెరిచివుంచాలని రిజర్వు బ్యాంక్ సూచించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో ప్రభుత్వ వ్యాపారాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుందన్న అంచనాతో ఈ సూచన చేసింది. ప్రభుత్వానికి చెందిన ఆర్థిక లావాదేవీలు, చెల్లింపులు అధికంగా ఉంటాయని కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 31న అన్ని బ్యాంకుల శాఖలు తెరిచి వుంచాలని సూచించింది.

Printed and